## బాజిరెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరిక



*గులాబీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న బాజిరెడ్డి గోవర్ధన్*

సారంగాపూర్, మే 1 : మండలంలోని జలాల్‌పూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు సీహెచ్.శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు గణేశ్‌తోపాటు పలువురు యువకులు బుధవారం బీఆర్ఎస్‌లో చేరారు. ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ వారికి గులాబీ కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఎంపీపీ అనూషా ప్రేమ్‌దాస్, మండల అధ్యక్షుడు మధుకర్‌రావు, గ్రామశాఖ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.



*బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు బుద్దె రాజేశ్వర్ ఇటీవల మృతి చెందగా ఆయన సతీమణి, బోధన్ ఎంపీపీ సావిత్రిని పార్టీ పార్లమెంట్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ బుధవారం సాలూరలో పరామర్శించారు. మాజీ ఎమ్మెల్సీ వీజీ గౌడ్, మాజీ ఎమ్మెల్యే షకీల్ సతీమణి ఆయేషా ఫాతిమాలతోకలిసి బుద్దె రాజేశ్వర్ చిత్రపటానికి నివాళులర్పించారు. – బోధన్, మే 1*

## చరిత్రలో రేవంత్ 420గా మిగిలిపోతాడు



*సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ అర్వింద్*

వినాయక్‌నగర్, మే 1 : చరిత్రలో రేవంత్ 420గా మిగిలిపోతాడని ఎంపీ ధర్మపురి అర్వింద్ విమర్శించారు. ఆరు గ్యారెంటీల హామీల నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికే రిజర్వేషన్ల మాట మాట్లాడుతున్నాడని ఆరోపించారు. జిల్లాకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకరులతో ఎంపీ అర్వింద్ మాట్లాడారు. రేవంత్ రెడ్డి నిజామాబాద్‌కు వచ్చినప్పుడు తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే సెప్టెంబర్ 17న చెరుకు ఫ్యాక్టరీని తెరిపిస్తానని హామీ ఇచ్చారని, ఇప్పుడు కోరుట్లలో తన మాటలను మార్చి మాట్లాడున్నాడని అన్నారు. కాంగ్రెస్ జోకర్ పార్టీగా తయారయ్యిందని ఎద్దేవా చేశారు. సమావేశంలో అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ పాల్గొన్నారు.

## గడ్డివాము దగ్ధం

రుద్రూర్, మే 1 : మండలంలోని చిక్కడ్‌పల్లిలో ప్రమాదవశాత్తు నిప్పంటుకొని గడ్డివాము బుధవారం దగ్ధమైంది. చిక్కడ్‌పల్లికి చెందిన రైతు సాజిద్ గేదెల కోసం ఉంచిన సుమారు 250 గడ్డి మోపులు కాలిబూడిదయ్యాయి. సుమారు రూ. 20 వేల నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు తెలిపారు.

## ముగిసిన శీతాకాల శిబిరం

రుద్రూర్, మే 1 : మండలంలోని రాయకూర్‌లో ఏడు రోజుల పాటు కొనసాగిన ఎన్ఎస్ఎస్ శీతాకాల శిబిరం బుధవారం ముగిసింది. శిబిరంలో విద్యార్థులు రోజుకో అంశంపై కార్యక్రమం నిర్వహించి, పారిశుద్ధ్యం తదితర వాటిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జయశంకర్ తెలంగాణ అగ్రికల్చర్ యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ జల్ల సత్యనారాయణ, ఫుడ్‌సైన్స్ కళాశాల అసోసియేట్ డి.కల్పన, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఇన్‌చార్జి ఎంపీడీవోగా బాధ్యతల స్వీకరణ



*ఇన్‌చార్జి ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరిస్తున్న ఎంపీవో మధురిమ*

సారంగాపూర్, మే 1 : నిజామాబాద్ ఎంపీడీవోగా విధులు నిర్వర్తించిన మల్లేశ్ ఉద్యోగ విరమణ పొందడంతో ఎంపీవో మధురిమకు ఇన్‌చార్జి ఎంపీడీవోగా బాధ్యతలు అప్పగించారు. మల్లేశ్ నుంచి ఆమె బుధవారం ఇన్‌చార్జి బాధ్యతలను స్వీకరించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ ప్రవీణ్‌రెడ్డి, పంచాయతీరాజ్ ఏఈ నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు ఎమ్మెల్యే వేముల ప్రచారం

మోర్తాడ్, మే1: మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో గురువారం సాయంత్రం 5.30 గంటలకు, దొన్కల్ గ్రామంలో రాత్రి 7 గంటలకు బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ తరపున ప్రచార కార్యక్రమంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ పాల్గొంటారని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కల్లెడ ఏలియా బుధవారం తెలిపారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు సకాలంలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

## పని ప్రదేశంలో కూలీలకు సౌకర్యాలు కల్పించాలి

ఏర్గట్ల, మే 1: ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున పని ప్రదేశాల్లో ఉపాధి హామీ కూలీలకు సౌకర్యాలు కల్పించాలని అన్ని గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లకు ఎంపీవో శివకుమార్ బుధవారం ఒక ప్రకటనలో సూచించారు. ఉపాధి హామీ పని జరిగే చోట టెంటు ఏర్పాటు చేయాలని, తాగు నీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని పేర్కొన్నారు.

# ప్రశ్నించే గొంతుక బాజిరెడ్డిని గెలిపించాలి

### మాజీ ఎమ్మెల్సీ వీజీ గౌడ్



*బూత్ కమిటీ సమావేశంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్సీ వీజీ గౌడ్*

మోపాల్ (ఖలీల్‌వాడి), మే 1 : ప్రశ్నించే గొంతుక బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌ను భారీ మెజార్టీతో గెలిపిస్తే మన తరఫున ఢిల్లీలో పోరాడుతారని మాజీ ఎమ్మెల్సీ వీజీ గౌడ్ అన్నారు. మోపాల్ మండలంలో గ్రామ కమిటీ నాయకులతో బుధవారం సమావేశం నిర్వహించి మాట్లాడారు. బాజిరెడ్డి గోవర్ధన్ రూరల్ నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేశారని అన్నారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మళ్లీ సీఎం కావాలని ప్రజలు కోరుకుంటున్నారని అన్నారు. కార్యక్రమంలో మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## బాజిరెడ్డికి మద్దతుగా ప్రచారం



*ఫత్తేపూర్‌లో ప్రచారం చేస్తున్న ఆర్మూర్ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి*



*గన్యాతండాలో ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు*



*మిట్టాపల్లిలో ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న బీఆర్ఎస్ మహిళా విభాగం మండల అధ్యక్షురాలు గీత*

ఆర్మూర్ టౌన్/ డిచ్‌పల్లి, మే 1 : నిజామాబాద్ ఎంపీగా బీఆర్ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌ను గెలిపించాలని ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి కోరారు. ఆర్మూర్ మండలంలోని ఫత్తేపూర్‌లో బీఆర్ఎస్ నాయకులతో కలిసి బుధవారం ప్రచారం చేశారు. కాంగ్రెస్ అమలుకు సాధ్యం కాని హామీలు ఇచ్చి గద్దెనెక్కిందని అన్నారు. కేసీఆర్ పాలన బాగుండేదని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత అష్ట కష్టాలు పడుతున్నామని ప్రజలు ఆయనకు వివరించారు. ఆరు గ్యారెంటీలు అని హడావిడి చేసి, ఇప్పుడు వాటి అమలుపై దృష్టి సారించడం లేదని విమర్శించారు.

డిచ్‌పల్లి మండలంలోని మిట్టాపల్లిలో బీఆర్ఎస్ నిజామాబాద్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌కు మద్దతుగా బీఆర్ఎస్ మహిళా విభాగం మండల అధ్యక్షురాలు పుప్పాల గీత బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. గ్రామంలో ఉపాధి కూలీలు పనిచేస్తున్న ప్రాంతానికి వెళ్లి ప్రచారం చేశారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలు ఎక్కడా అమలు కావడం లేదని వివరించారు. బాజిరెడ్డి గోవర్ధన్‌కు ఓటు వేసి ఎంపీగా గెలిపించాలని కోరారు.

జక్రాన్‌పల్లి మండలంలోని గన్యాతండాలో ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌కు మద్దతుగా బీఆర్ఎస్ నాయకులు ప్రచారం నిర్వహించారు. నాయకుడు కుంచాల రాజు ఆధ్వర్యంలో ఇంటింటికీ తిరుగుతూ బీఆర్ఎస్ పార్టీకి ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు చింతం మహేశ్, అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ‘పది’లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు సన్మానం



*కోటగిరి మైనార్టీ గురుకుల పాఠశాలలో విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు*



*పొతంగల్ హైస్కూల్‌లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు*

కోటగిరి, మే 1 : పదోతరగతి పరీక్షా ఫలితాల్లో మండల కేంద్రంలోని తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ గురుకుల పాఠశాల విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించారని ప్రధానోపాధ్యాయుడు మహ్మద్ బషీరుద్దీన్ తెలిపారు. పదోతరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులతోపాటు వారి తల్లిదండ్రులను ఉపాధ్యాయులు బుధవారం సన్మానించారు.

పదోతరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన పొతంగల్ మండలకేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు నవనీత, గంగామణిని ఉపాధ్యాయులు బువారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సాయిలు, ఉపాధ్యాయులు నాగనాథ్, పీఆర్టీయూ మండల అధ్యక్షుడు సూదం వెంకటేశ్, సీఆర్పీ రమేశ్, సూదం విఠల్, సూదం శంకర్, గంట్ల గంగాధర్ పాల్గొన్నారు.

# ఘనంగా మే డే



*బీఆర్టీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన మేడే వేడుకల్లో పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు, యూనియన్ జిల్లా అధ్యక్షురాలు విజయలక్ష్మి*

నమస్తే తెలంగాణ యంత్రాంగం, మే 1 : జిల్లావ్యాప్తంగా మేడే వేడుకలను వివిధ సంఘాల ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మిక జెండాలను ఎగురవేశారు. అనంతరం మేడే ప్రాముఖ్యతను సంఘాల ప్రతినిధులు వివరించారు.

జిల్లా కేంద్రంలో బీఆర్టీయూ జిల్లా అధ్యక్షురాడు విజయలక్ష్మి ఆధ్వర్యంలో మేడే నిర్వహించారు. కార్మిక యూనియన్‌లో జెండాను నుడా మాజీ చైర్మన్ ప్రభాకర్ ఎగురవేసి మాట్లాడారు. బీడీ కార్మికులు, భవన నిర్మాణ, మధ్యాహ్న భోజన కార్మికులకు జీతాలు పెంచిన ఘనత బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌దేనన్నారు. డిచ్‌పల్లిలో ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ కార్మికులు మేడే నిర్వహించారు. ఐఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు సాయినాథ్, సీపీఐఎంఎల్ జిల్లా కమిటీ నాయకుడు జేపీ గంగాధర్ జెండాను ఎగురవేశారు. జక్రాన్‌పల్లిలో జీపీ కార్మికులు సొప్పరి గంగాధర్ ఆధ్వర్యంలో మేడే నిర్వహించారు. ధర్పల్లిలో ఐఎఫ్‌టీయూ జిల్లా సహాయకార్యదర్శి రమేశ్ ఆధ్వర్యంలో సబ్‌స్టేషన్ ఎదురుగా కార్మిక జెండాను ఎగురవేశారు.

ఇందల్వాయిలో జీపీ కార్మికుల మండల అధ్యక్షుడు మాదరి గంగాధర్ జెండాను ఎగురవేశారు. కమ్మర్‌పల్లి మండలం హాసాకొత్తూర్‌లో ప్రజాపంథా కార్యాలయం ఎదుట మేడే వేడుకలను సీపీఐఎంఎల్ జిల్లా నాయకుడు సారాసురేశ్, ఐఎఫ్‌టీయూ జిల్లా సహాయ కార్యదర్శి సత్తెక్క ఆధ్వర్యంలో నిర్వహించారు. నందిపేట్‌లో ఉపాధిహామీ కూలీలతో ఏఐకేఎంఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగాధర్ మాట్లాడారు. మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు, కార్మిక వ్యతిరేక విధానాలను వివరించారు. మాక్లూర్ మండలంలోని మాదాపూర్‌లోని ఐఎంఎల్ డిపోలో సీఐటీయూ నాయకులు కొండ గంగాధర్, సాయిలు ఆధ్వర్యంలో, బోర్గాం(కే)లో సీపీఐఎంఎల్ నాయకులు దేశెట్టి సాయిరెడ్డి, కృష్ణాగౌడ్ ఆధ్వర్యంలో, ఒడ్డెట్‌పల్లి, మానిక్‌బండార్‌లో రైతు కూలీ సంఘం నాయకుడు దుడ్డు గంగాధర్ ఆధ్వర్యంలో మేడే వేడుకలు నిర్వహించారు. భీమ్‌గల్ మండల కేంద్రంలో ఐఎఫ్‌యూటీ ఆధ్వర్యంలో మే డే వేడుకలను నిర్వహించారు. ఐఎఫ్‌టీయూ ఆర్మూర్ డివిజన్ అధ్యక్షుడు కె.భూమేశ్వర్, సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి బి.భాస్కర్ మాట్లాడారు. నవీపేట మండల కేంద్రంలోని సుందరయ్య కాలనీలో సీఐటీయూ మండల అధ్యక్ష, కార్యదర్శులు ఆంజనేయులు, నాయక్‌వాడ్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో మేడే నిర్వహించారు. రెంజల్ మండలంలోని బోర్గాం, నీలా, తాడ్‌బిలోలి గ్రామాల్లో సీపీఐఎంఎల్ ప్రజాపంథ జిల్లా ఉపాధ్యక్షుడు పార్వతి రాజేశ్వర్, నాగన్న, పెద్దులు, పోశెట్టి, హమీద్ పాల్గొన్నారు.



*ధర్పల్లిలో మేడే లో పాల్గొన్న వివిధ సంఘాల నాయకులు, కార్మికులు*



*నందిపేట్‌లో మేడే వేడుకల్లో పాల్గొన్న ఏఐకేఎంఎస్ నాయకులు, ఉపాధిహామీ కూలీలు*

## కాంగ్రెస్ నాయకులను నమ్మి మళ్లీ మోసపోవద్దు

### బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు పోచారం సురేందర్‌రెడ్డి



*సమావేశంలో మాట్లాడుతున్న పోచారం సురేందర్‌రెడ్డి*

కోటగిరి, మే 1 : కాంగ్రెస్ నాయకులను నమ్మి మళ్లీ మోసపోవద్దని, ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలుచేకుండా ప్రజలను మోసం చేస్తున్నదని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు పోచారం సురేందర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశాన్ని బుధవారం నిర్వహించి మాట్లాడారు. బీఆర్ఎస్ జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించేందుకు కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని కోరారు. అధికారం చేపట్టి నాలుగు నెలలవుతున్నా రుణమాఫీ చేయలేదని, రైతుబంధు, రూ. 4 వేల పెన్షన్, మహిళలకు రూ.2500, కల్యాణలక్ష్మి కింద తులం బంగారం ఇవ్వలేదని తెలిపారు. ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్‌కు ఓటుతోనే బుద్ధి చెప్పాలన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు శంకర్‌పటేల్, ఏఎంసీ మాజీ చైర్మన్ మహ్మద్ అబ్దుల్ హమీద్, మాజీ సర్పంచ్ పత్తి లక్ష్మణ్, విండో చైర్మన్ కూచి సిద్ధు, పి.సాయిలు, శ్రీధర్, అనిల్‌కుమార్, హొగీరావుపటేల్, గంగాప్రసాద్‌గౌడ్, జుబేర్ తదితరులు పాల్గొన్నారు.

## హజ్ యాత్రికుల కోసం వైద్యశిబిరం



*వ్యాక్సిన్ వేస్తున్న దవాఖాన సూపరింటెండెంట్ ప్రతిమారాజ్*

ఖలీల్‌వాడి, మే 1 : జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ దవాఖానలో హజ్ యాత్రకు వెళ్లే వారి కోసం బుధవారం ప్రత్యేక వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ ప్రతిమారాజ్ యాత్రికులకు వైద్య పరీక్షలు నిర్వహించి, వ్యాక్సిన్ వేశారు. వ్యాధుల బారిన పడకుండా వ్యాక్సిన్ వేసినట్లు ఆమె తెలిపారు. జిల్లా నుంచి హజ్ యాత్ర వెళ్లేందుకు 375 మంది నమోదు చేసుకోగా.. ఇందులో నుంచి 330 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి, వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేశామని తెలిపారు.

## సాఫ్ట్‌బాల్ వేసవి శిక్షణ శిబిరం ప్రారంభం

డిచ్‌పల్లి, మే 1 : మండలంలోని మిట్టాపల్లి జడ్పీహెచ్ఎస్‌లో సాఫ్ట్‌బాల్ శిక్షణ శిబిరాన్ని జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేయగా.. సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శిక్షణ శిబిరం ఈనెల 31 వరకు కొనసాగనుందని తెలిపారు. వేసవిలో సాఫ్ట్‌బాల్ శిక్షణ శిబిరాన్ని క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విద్యార్థులు సెల్‌ఫోన్లకు పరిమితం కాకుండా, క్రీడల్లో పాల్గొనాలని అన్నారు. శిబిరానికి కోచ్‌గా పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు మార్కంటి గంగామోహన్ వ్యవహరిస్తున్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సుశీల్‌కుమార్, సీనియర్ క్రీడాకారులు గుండ వినయ్, అనికేత్, భూక్యా అంజలి, బానోత్ సంతోష్, తేజావత్ గంగాధర్, సిర్పాపల్లి సాయిలు, క్రీడాకారులు పాల్గొన్నారు.

## వాహనాల తనిఖీ

ధర్పల్లి, మే 1 : మండలంలోని మద్దుల్ ఎక్స్ రోడ్డు వద్ద ఎస్సై విక్రం.. సిబ్బందితో కలిసి బుధవారం వాహనాల తనిఖీ చేపట్టారు. ధ్రువపత్రాలు లేని వాహనదారులకు జరిమానా విధించారు. లోక్‌సభ ఎన్నికల కోడ్ ఉన్నందున రూ. 50 వేలకు మించి తరలించవద్దని సూచించారు.

## బీఆర్ఎస్ బూత్ కమిటీ నియామకం



*సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ పిట్ల ఉమాశ్రీరాములు*

మోస్రా (చందూర్), మే 1 : మోస్రా మండలంలోని చింతకుంటలో ఎంపీపీ పిట్ల ఉమా శ్రీరాములు ఆధ్వర్యంలో బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశాన్ని బుధవారం రాత్రి నిర్వహించారు. బూత్ లెవల్ కమిటీని నియమించారు. ఎన్నికల్లో ప్రచారం నిర్వహించి బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపునకు కృషిచేయాలని సూచించారు. సమావేశంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు హన్మంత్‌రెడ్డి, వంగ సాయాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## డయాగ్నోస్టిక్ సెంటర్లలో తనిఖీలు

వినాయక్‌నగర్, మే 1 : జిల్లా కేంద్రంలోని పలు డయాగ్నోస్టిక్ సెంటర్లపై మహిళా పోలీసు అధికారులు బుధవారం తనిఖీలు చేశారు. రహస్యంగా మహిళల ఫొటోలు, వీడియోలు తీస్తున్నారన్న ఆరోపణలు రావడంతో సీపీ కల్మేశ్వర్ ఆదేశాల మేరకు తనిఖీ చేపట్టినట్లు వారు తెలిపారు. సెంటర్లలో లింగనిర్ధారణ పరీక్షలు చేస్తున్నారా, మహిళల ఫొటోలు, వీడియోలు తీస్తున్నారా, సిబ్బంది దురుసుగా ప్రవరిస్తున్నారా తదితర కోణాల్లో పోలీసులు విచారణ చేపట్టారు. రహస్యంగా ఫొటోలు, వీడియోలు తీస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

NAMASTHE TELANGANA CLASSIFIEDS
నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

**WANTED**
★SR ఆక్వా సొల్యూషన్స్, నిజామాబాద్ వాటర్ ప్యూరి ఫైయర్స్ నందు పనిచేయుటకు టెక్నిషియన్ (Male) కావలెను. Qual: ఇంటర్, జీతం + ఇన్సెంటివ్ సంప్రః 98482 68883
NTZ-324910

**WANTED**
★హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్దులను, పేషంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి భోజనం. జీతం: 16k to 18k, ఏజెంట్ కమీషన్ 6k. Ph: 9640258899, 9640468899
NT-311845-All

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే,
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
"పేరు మార్పిడి" ప్రకటన
4 లైన్లకు 250/-
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
GST వర్తించును
సెల్: 91827 77590

**గమనిక**
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

## పోలింగ్ సామగ్రి పంపిణీ కేంద్రం పరిశీలన



*పోలింగ్ సామగ్రి పంపిణీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎన్నికల సాధారణ పరిశీలకురాలు*

శక్కర్‌నగర్, మే 1: బోధన్ పట్టణంలోని పోలింగ్ సామగ్రి పంపిణీ కేంద్రాన్ని, ఎన్నికల విధులు నిర్వహించే అధికారులు నిర్వహిస్తున్న శిక్షణా శిబిరాన్ని బుధవారం ఎన్నికల సాధారణ పరిశీలకురాలు ఎలీష్ వజార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె ఆర్డీవో అంబదాస్ రాజేశ్వర్, తహసీల్దార్ కె.గంగాధర్‌లకు పలు సూచనలు చేశారు. ఎన్నికల విధులు నిర్వహించే అధికారులు సకాలంలో పోలింగ్ మెటీరియల్ డిస్ట్రిబ్యూషన్ కేంద్రానికి వచ్చే విధంగా చర్యలు చేపట్టాలని, వారిని పోలింగ్ కేంద్రాలకు మెటీరియల్‌తో ఒకరోజు ముందుగానే చేర్చేలా చర్యలు చేపట్టాలని సూచించారు. పోలింగ్ ప్రశాంత వాతావరణంలో, ఎక్కడా పొరపాట్లు లేకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. పోలింగ్ కేంద్రాలను ముందుగానే సిద్ధం చేయించాలని, ఈ విషయంలో ఆయా మండలాలకు చెందిన అధికారులకు సూచనలు చేయాలని ఆమె అధికారులను ఆదేశించారు. ఆమెవెంట బోధన్ ఆర్డీవో అంబదాస్ రాజేశ్వర్, తహసీల్దార్ కె.గంగాధర్, ఎమ్మార్వై వరుణ్‌తోపాటు రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

## ఆర్టీసీ బస్సు ఢీకొని కూలీ మృతి

నందిపేట్, మే 1: మండలంలోని మాయాపూర్ శివారులో మంగళవారం ఆర్టీసీ బస్సు ఢీకొని ఆ గ్రామానికి చెందిన ఉపాధి హామీ కూలీ మేకల సాయన్న (48) మృతి చెందినట్లు ఎస్సై రాహుల్ బుధవారం తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. మంగళవారం గ్రామ శివారులో ఉపాధి హామీ పనులకు సాయన్న వెళ్లాడు. పనులు పూర్తయ్యాక బైక్‌పై ఇంటికి తిరిగి వస్తుండగా వెనుక నుంచి అతివేగంగా వచ్చిన ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. దీంతో తలకు తీవ్ర గాయాలు కావడంతో సాయన్న అక్కడికక్కడే మృతి చెందాడు. డ్రైవర్ అజాగ్రత్తగా, అతివేగంగా బస్సు నడపడంతోనే ప్రమాదం జరిగినట్లు ఎస్సై తెలిపారు. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు డ్రైవర్‌పై కేసు నమోదు చేసి శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు.

## ట్రాక్టర్ బోల్తా పడి ఒకరు..

ఎడపల్లి, మే 1: మండలంలోని ఠానకలాన్ గ్రామంలో బుధవారం ట్రాక్టర్ బోల్తాపడి ఒకరు మృతి చెందారు. ఎస్సై వంశీకృష్ణారెడ్డి కథనం మేరకు.. ఠానకలాన్ గ్రామానికి చెందిన మఠం నర్సయ్య(45) తన ట్రాక్టర్ తీసుకొని వెళ్లి సాయికుమార్ అనే రైతు పొలం దుక్కి దున్నాడు. తిరిగి ఇంటికి వస్తుండగా చెరువు కట్టపై అదుపుతప్పి ట్రాక్టర్ బోల్తా పడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య విజయ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## చికిత్స పొందుతూ యువకుడి మృతి

మోర్తాడ్(కమ్మర్‌పల్లి), మే1: జగిత్యాల జిల్లా కోరుట్ల మండల కేంద్రానికి చెందిన శ్రీరాముల శ్రీకాంత్(32) చికిత్స పొందుతూ మృతిచెందినట్లు కమ్మర్‌పల్లి ఎస్సై రాజశేఖర్ బుధవారం తెలిపారు. ఎస్సై కథనం మేరకు.. శ్రీకాంత్ బైకుపై ఈనెల 28న ముప్కాల్ మండలం వేంపల్లికి వెళ్లి తిరిగి కోరుట్ల వెళ్తున్నాడు. కమ్మర్‌పల్లి శివారులో ఎదురుగా వస్తున్న ఆటో ఢీకొట్టింది. గాయాలపాలు కావడంతో దవాఖానలో చేర్పించారు. చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందాడు. మృతుడి అన్న ఫిర్యాదు మేరకు బుధవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు.

## తక్కువ గ్రేడు వచ్చిందని విద్యార్థి ఆత్మహత్యా యత్నం

నవీపేట, ఏప్రిల్ 1: మండల కేంద్రంలోని ఓ పాఠశాలకు చెందిన విద్యార్థి పదో తరగతి ఫలితాల్లో తక్కువ గ్రేడు పాయింట్లు వచ్చాయని మనస్తాపంతో గడ్డిమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని మహంతం గ్రామానికి చెందిన సాయిచరణ్ పదో తరగతి పరీక్ష రాశాడు. మంగళవారం వెలువడిన ఫలితాల్లో 8.3 జీపీఏ వచ్చింది. తనకు ఎక్కువ గ్రేడు పాయింట్లు రాలేదని బెంగతో మంగళవారం రాత్రి గడ్డి మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. బుధవారం వాంతులు కావడంతో కుటుంబీకులు ఆరా తీయగా గడ్డిమందు తాగినట్లు తెలిపాడు. వెంటనే కుటుంబీకులు చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రంలోని ప్రైవేటు దవాఖానకు తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈఘటనపై ఫిర్యాదు అందలేదని ఎస్సై యాదగిరిగౌడ్ పేర్కొన్నారు.